తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## సంపద తయారి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



శ్రీకాళహస్తి రూరల్,జనవరి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం అమందూరు గ్రామంలో శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణతో కలసి పర్యటించారు.ఇక్కడ గ్రామ పంచా యతీ ఇతర పంచాయతీలకు ఆదర్శం గా మార్గదర్శకంగా చక్కగా చెత్త నుంచి సంపద తయారి కేంద్రాన్ని నిర్వహి స్తున్నారు.ఈ కేంద్రాన్ని పరిశీలించారు. నిర్వాహకులు చక్కగా తీర్చి దిద్దుతున్నారని ఇంకా మెరుగ్గా ఎలా చేయాలి అనే అంశాలకు సంబంధించి నిర్వాహకులకు వివరించారు.ఈ కార్యక్రమాల్లో కలెక్టర్‌తో పాటు ఎంపిడిఓ జి.సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

# పట్టు వదలని విక్రమార్కుడు...

- తండ్రి బాటలో తనయుడు...జూనియర్ అసిస్టెంట్ నుంచి డీఈవో స్థాయికి
- నాటి మాజీ మంత్రి దేవినేని రమణకు పర్సనల్ సెక్రటరీగా పనిచేసిన ఘనత
- 10వ తరగతి వందశాతం యాక్షన్ ప్లాన్ అమలుకు నిరంతర కృషి

తిరుపతి జిల్లా డీఈవోపై ప్రభాతవార్త ప్రత్యేక కథనం...






తిరుపతి కలెక్టరేట్ ప్రభాతవార్త ః

అనుకున్న పని సాధించే వరకు పట్టు వదలని భట్టి విక్రమార్కుడు...మన తిరుపతి జిల్లా జిల్లా విద్యాశాఖాధికారి కోట వెంకట నాగేంద్ర కుమార్.. తండ్రి బాటలో తనయుడు అన్న మాటను సార్థకం చేసిన మహోన్నతవ్యక్తి కేవీ నాగేంద్రకుమార్...పొట్టివాడైనా గట్టివాడు... పుట్టింది కృష్ణాజిల్లా కంకిపాడు మండలం అదే గ్రామం...ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసిన నాన్న కోట వెంకట హరినాథబాబు వారసత్వాన్ని అందిపుచ్చుకున్నాడు.చిన్న నాటి నుంచే తానూ తన తండ్రిలా పది మందికి సేవ చేయాలన్నదే ఆయన జీవిత లక్ష్యం. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు కోట వెంకట హరినాథబాబు, కోట వెంకట వరలక్ష్మి ముద్దుల పట్టి. చిన్న నాటి నుంచే కష్టపడి పైకి రావాలన్నదే ఆయన జిజ్ఞాస. ఏంఏ బీఈడీ చదువులు పూర్తి చేసుకుని విద్యాశాఖ విభాగంలో మొట్ట మొదగా 5 జనవరి 1995లో జూనియర్ అసిస్టెంట్‌గా విజయవాడ ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో అడుగుపెట్టాడు. అడుగు పెట్టిన రోజు నుంచి నేటి వరకు ఎందులోనూ వెను తిరగలేదు. విద్యాశాఖలో క్రింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల ఆశీస్సులతో అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. 1998లో నాటి విద్యాశాఖా మాజీ మంత్రి దేవినేని వెంకట రమణకు పర్సనల్ సెక్రటరీగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కింది. పదోన్నతిపై సీనియర్ అసిస్టెంట్‌గా 25 నవంబరు, 2007లో కృష్ణాజిల్లా మచిలీపట్నం డీఈవో కార్యాలయంలో విధులు నిర్వర్తించాడు. 21 ఏప్రిల్,2017లో వెస్ట్ గోదావరి జిల్లా వేలూరు డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. అలాగే అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ అదనపు బాధ్యలుగా విజయవాడ ఎన్టీఆర్ జిల్లా డీఈవోగా పనిచేస్తున్న తరుణంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖ అక్కడ నుంచి తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు పంపారు.ఈ మేరకు 26అక్టోబరు, 2024న తిరుపతి జిల్లా డీఈవోగా బాధ్యతలు చేపట్టారు.దీంతో పాటు సమగ్ర సర్వశిక్షాబియాన్ ఏపీవోగా అదనపు బాధ్యతలు ప్రస్తుతం నిర్వహిస్తున్నారు.పిట్ట కొంచెం కూత ఘనం అన్న చందాన విధి నిర్వహణలో దూసుకెళుతున్నాడు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు జిల్లా విద్యాశాఖలో అందరిని కలుపుని ముందుకు వెళుతూ కొద్ది రోజుల్లోనే కేవీ నాగేంద్రకుమార్ మార్క్ కనిపిస్తోందని జిల్లా విద్యాశాఖలో క్రింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నత స్థాయి ఉద్యోగుల నుంచి వినిపిస్తున్న మాటలు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ కథ ఏమిటో తేల్చుతూ ఆ సమస్యలను పరిష్కరిస్తూ ముందుకెళుతూ ఒక యుద్ధ సైనికునిలా పనిచేస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం, అలాగే విద్యాశాఖ ఉన్నతాధికారులు తనపై పెట్టిన బాధ్యతను తు.చ తప్పకుండా నిర్వహిస్తూ మరో ప్రక్క ప్రభుత్వ ప్రోటోకాల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. 2025లో పదవ తరగతిలో విద్యార్థినీ, విద్యార్థులు వందకి వంద శాతం ఉత్తీర్ణత సాధించేం దుకు జిల్లాలోని డీవైఈవో,ఎంఈవోలు, హెచ్ఎంలతో నిరంతరం సభలు,సమావేశాలు.పదవ తరగతి వంద శాతం యాక్షన్ ప్లాన్‌కు అమలకు ఆయన చేస్తున్న కృషిని ఆ శాఖాధికారులు అభినందిస్తున్నారు.పిల్లలకు ప్రత్యేక తరగతులు. తక్కువ మార్కులు వచ్చిన, చదువులో వెనుకబడిన పిల్లలకు ఆయా క్లాస్ టీచర్లతో ప్రత్యేక బోధన. బడిఈడు బడిలోనే ఉండాలన్నదే ఆయన తపన. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో నడిపించాలన్నదే ఆయన ఆకాంక్ష.జిల్లాలోని విద్యార్థిని విద్యార్థులు ఉచిత విద్య, భోజనం, కిట్స్‌ను సద్వినియోగం చేసుకునే విధంగా గ్రామ స్థాయి పాఠశాలల నుంచి ఉన్నతస్థాయి హెస్కూళ్ళ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, ఉప విద్యాశాఖాధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యం. మొత్తం మీద ప్రపంచ ప్రఖ్యాతిఖాంచిన తిరుమల శ్రీవారి పాదాల చెంత తిరుపతి జిల్లా విద్యాశాఖా ధికారిగా తాను పనిచేయడం పూర్వజన్మ సుకృతంగా డీఈవో కోట వెంకట నాగేంద్రకుమార్ భావించడం అభినందనీయం.

# వచ్చేస్తామంటున్నా....చేర్చుకోరే!?

## తిరుపతిలో వైసిపి కార్పొరేటర్ల వింతగాథ -స్వతంత్రంగానే ఉండేందుకు నిర్ణయం



ప్రభాతవార్త-తిరుపతి:

ఆధ్యాత్మికనగరం తిరుపతిలో తొలిసారిగా నగరపాలక సంస్థకు జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో వైసిపి నుండి గెలిచి నాలుగుసంవత్సరాలు పెత్తనం చలాయించిన కొందరు కార్పొరేటర్లు అధికారం మారడంతో కొత్త వాణి వినిపిస్తున్నారు.. ఉన్న పార్టీలో ఇమడలేక అధి కారపార్టీల సరసన చేరేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. అదిగో ..ఇదిగో వచ్చేస్తాం...చేర్చుకోండి స్వామీ అని ప్రాధేయపడుతున్నా చేర్చుకునేందుకు కూటమి పార్టీలు ససేమిరా అంటుండటంతో ఓ అబిమానులూ తమ వింతగాథ వినండహో అంటూ నిట్టూర్చుతుండటం ఇప్పుడు హాట్‌టాఫిక్‌గా మారింది. నగరంలో డివిజన్ల అభివృద్ధిని ,నమ్మి గెలిపించిన జనాన్ని పక్కనపెట్టేసి కూటమి పార్టీల్లో చేరిపోవడమే ధ్యేయంగా అన్నీ నడిపించే నేతతో కలసి పావులు కదుపుతున్నారు. అయితే గత మూడునెలలుగా తమ మాటను కూటమి పార్టీల నేతలు బేఖాతర్ చేయడంతో ఇప్పుడు చేసేదిలేక పక్కచూపులు చూడటం, ఎంతకూ అనుమతిరాకుంటే స్వతంత్రంగానే మిగిలిపోయేందుకు కూడా సిద్దమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే గత వారంలో తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లోని వైసిపి ఉపమేయర్ ముద్రనారాయణ నేతృత్వంలో కార్పొరేటర్లు నరసింహాచారి, పొన్నాల చంద్ర, అనిల్, దొడ్డారెడ్డి ప్రవళిక భర్త మునిశేఖర్‌రెడ్డి, ,కుడితి సుబ్రమణ్యం, కుమారి భర్త శివ, నరేంద్రనాథ్ ఓ హోటల్‌లో కీలకంగా సమావేశమై తమ భవిష్యత్తు కార్యాచరణ గురించి సుదీర్ఘంగా చర్చించుకోవడం మరీ విశేషం. ఈ నేపథ్యంలో ఇప్పుడు వైసిపికి చెందిన తిరుపతి కార్పొరేటర్లు 47మందిలో 15మందివరకు పార్టీని వీడేందుకు పక్కచూపులు చూస్తున్నారు. అయితే ఇప్పుడు తిరుపతి నగరపాలకసంస్థ కౌన్సిల్ పదవీకాలం మరో ఆరునెలలు ఉండటంతో వీరిని చేర్చుకున్నా తమ పార్టీలకు ఒరిగేదేమీలేదనేది టిడిపినేతలు బలంగా చెబుతున్నారు. ఇదే విషయాన్ని అధినేత, సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి కూడా స్థానిక నేతలు తీసుకెళ్ళడంతో సానుకూలంగా స్పందించారనేది తెలుస్తోంది. మరీ ఈ కార్పొరేటర్లు ఇప్పుడు ఉన్నఫళంగా గెలిచిన వైసిపిని వీడి, గతంలో ఎమ్మెల్యే,టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చెంత ఆయనకు నమ్మిన బంట్లుగా ఉన్న వీరంతా ఒక్కసారిగా బయటకు రావడానికి కారణాలు కూడా ఏమిటనేది టిడిపి నేతలు ఆలోచనలో పడ్డారు. మరీ తిరుపతిలో సిట్టింగ్ ఎమ్మెల్యే జనసేనపార్టీకి చెందిన శ్రీనివాసులు ఈ కార్పొరేటర్లును ప్రోత్సహించి జనసేన కండువా వేసేందుకు సుముఖత చూపినా జనసేనాని నుండి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో సైలెంట్ అయ్యారనేది నగరంలో పెద్దగా చర్చ సాగుతోంది. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరుజిల్లాలో కుప్పం, చిత్తూరు నగరపాలక కౌన్సిల్‌లు పూర్తిగా టిడిపి పరమయ్యాయి. ఇందుకు ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్‌మోహన్ కీలకపాత్ర పోషించి కథ నడిపారు. అయితే తిరుపతిలో ఇప్పుడా ఆ పరిస్థితి కనిపించడంలేదు. బలంగా ఉన్న టిడిపి నేతలు మద్దతునిస్తేనే జనసేన పార్టీ ఉనికి చాటుకునే పరిస్థితి ఉంది. ఇప్పటికే జనంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పనితీరుపై వ్యతిరేకత అంతర్గతంగా మొదలైంది. మరీ రానున్న రోజుల్లో ఇదే ధోరణి కొనసాగితే జనసేనపార్టీని కాదని కేడర్ టిడిపి కండువాలతోనే జనానికి దగ్గరయ్యే సూచనలు లేకపోలేదు. ఇప్పుడు కూటమి నేతలను వైసిపి కార్పొరేటర్లు ఎవరు ,ఎంతమంది మెప్పించి కండువాలు మార్చుకుంటారనేది కాలం నిర్ణయించనుంది. అదేగాక వైసిపి కార్పొరేటర్లు టిడిపిలో చేరితే స్థానికంగా తనకున్న పట్టు కోల్పోతామనే అంతర్మథనంతో జనసేన వర్గాలు కూడా ఆలోచనతో వైసిపి కార్పొరేటర్లును కలుపుకునేందుకు పెద్దగా ఆసక్తిచూపడంలేదనేది రాజకీయనేతల విశ్లేషణ.

## కంగుందిలో కలెక్టర్‌చే సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



కుప్పంరూరల్, జనవరి 4ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఈనెల 7వతేది మండలంలోని కంగుంది గ్రామంలో పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ మణికంత చందోలు, ఎఎస్పీ రాజశేఖం బాబు తదితరులు గ్రామంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం తం డ్రి దివంగత మాజీ సర్పంచ్ పిఆర్ శ్యామన్న విగ్రహాన్ని సిఎం చంద్రబాబునాయుడు ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణ ప్రాంతంలో భద్రత ఏర్పాట్లు, చేపట్టాల్సిన కార్యక్రమాలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు.

## భక్తులు ఓపికతో దర్శన టోకెన్లు అందుకోవాలి

### పూర్తి సదుపాయాలు కల్పించాం -టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు





తిరుపతి,జనవరి 4ప్రభాతవార్త:

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి సామాన్యభక్తులకోసం ఆఫ్‌లైన్‌లో ఉచిత టోకెన్లు జారీచేస్తామని, ఈ టోకెన్లను భక్తులు ఓపికతో తమ వరుసక్రమం వచ్చేవరకు క్యూలైన్లలో ప్రశాంతంగా ఉండాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు కోరారు. తిరుపతిలో టోకెన్లు జారీచేసే 9 ప్రాంతాల్లో అన్ని సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. టోకెన్లు లేని భక్తులను ఆలయంలోనికి అనుమతించడం జరగదన్నారు. 9వతేదీ ఉదయం 5గంటల నుండి తిరుపతిలో ఒకేరోజు 10,11,12తేదీలకు సంబంధించిన టోకెన్లు జారీచేయడం జరుగుతుందన్నారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని ఛైర్మన్ తెలిపారు. టోకెన్లు కౌంటర్ల వద్ద భక్తులకు సౌకర్యాలు, ఏర్పాట్లపై శనివారం ఉదయం తిరుపతిలోని రామ చంద్రపుష్కరిణి వద్ద ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధికారులతో కలసి పరిశీలించారు. తిరుపతిలో ఇందిరామైదానం, శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్, రామచంద్రపుష్కరిణి, బైరాగిపట్టెడ రామానాయుడు ఉన్నతపాఠశాల, ఎంఆర్‌పల్లిలోని జడ్పీ ఉన్నతపాఠశాల, జీవకోన జడ్పీ ఉన్నతపాఠశాలల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 13వతేదీ నుండి 19వరకు ఏరోజు దర్శనాలకు ఆ ముందురోజు టోకెన్లను శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో జారీచేస్తారన్నారు. తిరుమల స్థానికులకు బాలాజీనగర్‌లో కౌంటర్లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఛైర్మన్ నాయుడుతోబాటు టిటిడి జెఈఓ గౌత మి, సిఇ సత్యనారాయణ, సివిఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ ఈఓ లోకనాథం, నగరపాలకసంస్థ కమిషనర్ మౌర్య,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి,

## గుడిమల్లం ఆలయంలో అమెరికా భక్తులు



శ్రీకాళహస్తిరూరల్,జనవరి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరుని శనివారం అమెరికా వాసులు దర్శించుకున్నారు.వారిని పెంచలకోనలోని కరుణామయి ఆశ్రమానికి చెందిన పీఠాదిపతి విజయ దేవి అమ్మవారు సుమారు 50 మంది అమెరికా వాసులతో పుణ్యక్షేత్రాల సందర్శనకు వచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి పిఆర్ఓ రవి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా శనివారం పరశురామేశ్వరాలయానికి వచ్చారు. వారికి ఆలయ ఛైర్మెన్ బత్తుల గిరినాయుడు కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి అర్చకులు,వేదపండితులు స్వాగతం పలికారు. ఆలయం ప్రాధాన్యతను పీఠాధిపతి వివరించారు. పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఆలయం ఉందని చారిత్రాత్మక ప్రాధాన్యత ఉందని వివరించారు.

## ఉడకని భోజనం .. బాలికలకు కడుపునొప్పి

### హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి తరలింపు

చంద్రగిరి, జనవరి 4 ప్రభాతవార్త:

స్థానిక శ్రీపద్మావతీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థినులు శనివారం మధ్యాహ్నం ఉడకని భోజనం తిని కడుపునొప్పి రావడంతో హెచ్ఎం వెంకటరమణారెడ్డి తమ టీచర్స్‌తో ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎంఎల్ఏ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, ఇన్‌చార్జ్ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రీనివాసరావుతో కలసి విద్యార్థినులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'డొక్కా సీతమ్మ" మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించడం మొదటి రోజుకావడంతో వంటలు ముందుగా కళాశాల విద్యార్థినులు 747 మందికి తయారు చేసి పంపించారని అన్నారు. రెండవ దఫాలో స్కూల్ విద్యార్థినులు 629 మందికి తయారు చేయడంలో సమయం ఎక్కువ కావడంతో భోజనం తగినంతగా ఉడకలేదన్నారు. దీంతో పిల్లలు అరాయించుకోలేక కడుపు నొప్పితో భాధపడ్డారని అన్నారు. మెరుగైన వైద్యసేవలు అందించడంతో విద్యార్థినులు కోలుకున్నట్లు తెలిపారు.

## బీసీ విద్యార్థినులకు మెరుగైన వైద్యం

### కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌కు మంత్రి సవిత ఆదేశం

తిరుపతి కలెక్టరేట్, జనవరి 4 ప్రభాతవార్త ః

చంద్రగిరి ఇంటిగ్రేటెడ్ బాలిక హాస్ట్ విద్యార్థినులకు అస్వస్థతపై మంత్రి సవిత ఆరా తీశారు. మెరుగైన వైద్య మందించాలని శనివారం మంత్రి తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌కు ఆదేశాలు జారీ చేశారు. 27 మంది చంద్రగిరి ఇంటి గ్రేటెడ్ బాలిక హాస్టల్ విద్యా ర్థినులు వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. వారిలో 18 బీసీ విద్యార్థినులు ఉన్నారు. ఈ విషయం తెలుసు కున్న వెంటనే తిరుపతి జిల్లా కలెక్టర్‌తో మంత్రి సవిత ఫోన్‌లో మాట్లాడారు. అస్వస్థతకు గురైన విద్యా ర్థిను ల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలన్న మంత్రి,హాస్టల్‌లో వైద్యశిబిరం నిర్వహించాలని ఆదేశించారు.

## మందుల పర్యవేక్షణతో తనకు సంబంధం లేదు:

### డ్రగ్ ఇన్సెపెక్టర్ డాక్టర్ ప్రశాంతి

శ్రీకాళహస్తి,జనవరి 4 ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలో మందుల దుకాణాలు,శాంపుల్స్ వినియోగానికి సంబంధించి తనకు సంబంధం లేదని తిరుపతిజిల్లా డ్రగ్ ఇన్సెపెక్టర్ డాక్టర్ ప్రశాంతి శనివారం వివరణ ఇచ్చారు. మూడు రోజుల పాటు వైద్యశాఖలో, డాక్టర్ల పని తీరుకు సంబంధించి మూడు రోజుల పాటు వార్త దిన పత్రికలో ప్రచురితమైన సీరియల్‌కు సంబంధించి స్పందించిన డ్రగ్ ఇన్సెపెక్టర్ డాక్టర్ స్రవంతి స్పందించారు.డాక్టర్ల అత్యధిక పీజుల వసూలుకు సంబంధించి డ్రగ్ ఇన్సెపెక్టర్‌కు సంబంధం లేదన్నారు.ఇక ల్యాబ్‌లను పర్యవేక్షించే అధికారం డ్రగ్ ఇన్సెపెక్టర్‌కు లేదన్నారు. ఇక శ్రీకాళహస్తిలో ఒకేవలం 500+ షాపులు మాత్రమే ఉన్నాయని వివరణ ఇచ్చారు. డాక్టర్లు శాంపుల్స్‌ను విక్రయిస్తుంటే పట్టించుకోలేమన్నారు.చట్టపరిధిలో తాము చర్యలు తీసుకుంటున్నామన్నారు.అలాగే ఎంపిఆర్‌పికి 5 కేసులు నమోదు చేసినట్లు డ్రగ్ ఇన్సెపెక్టర్ స్రవంతి వివరించారు.

## 9.24కోట్లతో ప్రజలకు తాగునీటి సరఫరాకై చర్యలు

### - ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జనవరి 4 ప్రభాతవార్త :

కుప్పం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా చేసేందుకు సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపడుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం డికెపల్లి చెరువు వద్ద అమృత్2.0పథకం ద్వారా తాగునీటి సరఫరాకై చేపట్టే పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కమీషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌని ్సలర్లు సోమశేఖర్, సురేష్,జాకీర్, వేలు, ఎంఆర్ సురేష్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, మంజు, నరేష్, శివశంకర్,జయరాంనాయుడు, సుధ, తదితరులు పాల్గొన్నారు.

## 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### ఒకరు అరెస్టు .. అడవుల్లో డంప్‌ను గుర్తించిన టాస్క్ ఫోర్స్



తిరుపతి కార్పొరేషన్, జనవరి 4, ప్రభాతవార్త

తిరుమల శేషాచలం అటవీప్రాంతంలో 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఒకరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీలు జి. బాలిరెడ్డి,వీ. శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్‌ల మార్గ నిర్దేశంలో ఆర్ ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ ఎస్ ఐ విష్ణు వర్ధన్ కుమార్ టీమ్ శుక్రవారం రాత్రి నుంచి తిరుమల శేషాచలం అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. శనివారం ఉదయం ఒక ప్రాంతంలో ఒక వ్యక్తి కనిపించాడు. అతను పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. అతనిని విచారించగా ఒక డంప్‌లో దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలు చూపించాడు. అతనిని తమిళనాడు కు చెందిన వ్యక్తి గా గుర్తించి అరెస్టు చేశారు. అతనిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అడవిలోని మరికొంత మంది స్మగ్లర్లు ఉన్నట్లు విచారణ లో తెలియడంతో వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు.

# ఆధ్యాత్మిక నిలయంలో ఆకతాయిల ఆగడాలు : మందుబాటుల విందులు

### రెండు రోజులుగా జల్సాలు: విధుల నుండి ఇద్దరు తొలగింపు

శ్రీకాళహస్తి,జనవరి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న వరదరాజ స్వామి అతిది గృహం నిత్యం వివాదాలకు నిలయంగా మారింది. శనివారం మధ్యాహ్నం ఓ యువకుడు తూలుతూ తూగుతూ మాట్లాడలేని స్థితిలో ప్రజల కంట పడ్డారు.దాంతో మందుబాబుల బండారం బట్టబయలైంది.ఈ అతిథి గృహంలో గత కొంత కాలంగా అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ ఓ యువతి స్నానమాచరిస్తుంటే సెల్‌ఫోన్‌లో చిత్రిస్తూ పట్టుబడ్డాడు. శనివారం ఓ యువకుడు మోహన్‌రెడ్డి అనే యువకుడు పట్టుబడ్డాడు. ఆతన్ని పోలీసులు విచారించగా గంజాయి సేవించి గతంలో పలు కేసుల్లో ఉన్నట్లు సమాచారం.

**రెండు రోజులుగా ఉంటే సిబ్బంది ఏం చేస్తున్నట్లు?**

నెహ్రూవీధిలోని వరదరాజస్వామి అతిధి గృహంలో ఈ నెల 2 వ తేది మోహన్‌రెడ్డి పేరుతో గది తీసుకున్నారు. రెండు రోజుల పాటు మొదటి అంతస్తు 7వ నెంబర్ గదిని తీసుకున్నారు. పట్టుబడ్డయువకునితో పాటు మరో ఐదు గురు ఉన్నట్లు సమాచారం. వీరు రెండు రోజుల పాటు గదిలో జల్సాలు చేస్తున్నా సిబ్బంది ఏం చేస్తున్నట్లు చర్చనీయాంశంగా మారింది. శనివారం మధ్యాహ్నం మోహన్‌రెడ్డి తూలుతూ ప్రజల కంట ప డటంతో అసలు విషయం బయట పడింది. 2 రోజుల పాటు జల్సాలు చేసిన వారు వెళుతూ పట్టుబడ్డారు. గదిలో మద్యం బాటిల్స్ డస్ట్‌బిన్‌లో కనబడ్డాయి. ఇక్కడ విచ్చలవిడిగా మాంసాహారం భుజించినట్లు సమాచారం.ఒక గదిలో ఐదారుమందిని ఎలా అనుమతించారన్నది చర్చనీయాంశంగా మారింది.స్థానికులకు దేవస్థానం గది ఎలా ఇచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది.గది తీసుకున్న యువకుడు అక్కడ దేవస్థానంలో పని చేసే ఉద్యోగి కుమారుడు అని తెలిసింది.





డస్ట్‌బిన్‌లో మద్యం బాటిల్స్ దృశ్యం, , .పోలీసులు అదుపులో తీసుకున్న యువకుడు

**పోలీసుల అదుపులో యువకుడు: ఇద్దరు సస్పెండ్**

శ్రీకాళహస్తి దేవస్థానంకు సంబంధించిన అతిధి గృహంలో అసాంఘీక కార్యక్రమాలపై ఇఓ బాపిరెడ్డి స్పందించారు. ఇలాంటి సంఘటనలు బాధాకరమన్నారు. అతిధి గృహాల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. రెండు రోజులుగా గదిలో ఎవరు ఉన్నారన్నది పర్యవేక్షించక పోవటం విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వివరించారు. ఈ సంఘటనలో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు ఇఓ బాపిరెడ్డి వివరించారు. విధిలో ఉన్న మాధ వరెడ్డి, లక్ష్మీరెడ్డిలను సస్పెండ్ చేసినట్లు వివరించారు. కాగా అర్బన్ సిఐ డి.గోపి మాట్లాడుతూ ఒకరిని అదుపులో తీసుకున్నామని విచారిస్తున్నట్లు తెలిపారు.అదుపులో తీసుకున్న యువకుడు గతంలో పలు కేసులతో సంబంధం ఉన్నట్లు రికార్డులుచెబుతున్నాయన్నారు.

# గూడూరు డివిజన్

## రెవిన్యూ సదస్సులు ద్వారా సమస్యలు పరిష్కారం



డక్కిలి,జనవరి 4 ప్రభాతవార్త : గ్రామాలలో జరుగుతున్న రెవిన్యూ సదస్సులు ద్వారా రెవిన్యూ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు డక్కిలి తహశీల్దారు ఎం.శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వెలికల్లు గ్రామంలో శనివారం రెవిన్యూ సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్నీ రెవిన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి ప్రజలు నుంచి అర్జీలు తీసుకుంటున్నట్లు వివరించారు. అంతక ముందు గూడూరు సబ్ కలెక్టరు రాఘవేంద్ర మీనా సదస్సును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయరు రాజగోపాల్,ఏఎస్వో వెంకటయ్య, సచివాలయం సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుప్పాల సేవలో కళ్యాణ వెంకటేశ్వరస్వామి



వెంకటగిరి, జనవరి 4 ప్రభాతవార్త: పట్టణంలోని కర్ణకమ్మవీధిలో వెలసి ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామికి తిరుప్పాడ సేవా చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వర స్వామి దర్శించుకున్నారు.

## విద్యార్థి దశ అత్యంత కీలకం : ఎమ్మెల్యే విజయశ్రీ



సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త : ఇంటర్మీడియట్ విద్యార్థి దశ అత్యంత కీలకమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె లాంఛనంగా ప్రారంభిం చారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, మాధవనాయుడు, ఎజి కిషోర్, జనసేన నాయకులు పొన్నా కాటయ్య, బిజెపి నేతలు టి.ఆదినారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

## 47వ ఆంధ్రప్రదేశ్ చరిత్ర సమాఖ్య సమావేశాలు ప్రారంభం



గూడూరు, జనవరి 4 ప్రభాతవార్త : 47వ ఆంధ్రప్రదేశ్ చరిత్ర సమాఖ్య వార్షిక సమావేశాలు స్థానిక ఎస్.కె.ఆర్. డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రారంభమైనాయి. ఈ రెండు రోజులు సమావేశాలకు ఆంధ్రప్రదేశ్ నుండే కాకుండా దేశవ్యాప్తంగా అనగా తెలంగాణ, కాశ్మీర్, ఢిల్లీ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పాండిచ్చేరి, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, సిక్కిం, మణిపూర్,అస్సాం రాష్ట్రాల నుండి చరిత్ర అధ్యాపకులు, పరిశోధకులు, చరిత్రకారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ అధ్యక్షత వహించి ఈ ఘనతర సమావేశాలు మా కళాశాలలో నిర్వహించడం గర్వకారణం అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీ.కే. డబ్ల్యూ ప్రభుత్వ కళాశాల, నెల్లూరు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి మాట్లాడుతూ చరిత్రము కాపాడుకోవడం మన బాధ్యత, అది భావితరాలకు అందించడం మనందరి కర్తవ్యం అన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కాళిదాసు పురుషోత్తం మాట్లాడుతూ చరిత్రను ప్రభుత్వం కూడా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. 47వ వార్షిక చరిత్ర సమాఖ్యకు నూతన అధ్యక్షుడిగా ఆచార్య ఏ.ఆర్ రామచంద్రారెడ్డి బాధ్యతను స్వీకరించారు. ఏపీ చరిత్ర సమాఖ్య వ్యవస్థాపక సభ్యుడు ఆచార్య పి. రామకృష్ణ ఈ సమాఖ్య విశిష్టతను సభికులకు వివరించారు. ముంబై నుండి డాక్టర్ తలిశెట్టి శ్రీలక్ష్మి హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆచార్య బి.లావణ్య హైదరాబాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం నుండి ఎం. వనజ విజయవాడ నుండి డాక్టర్ కొంపల్లి సుందర్ నెల్లూరు నుండి డాక్టర్. మమత చరిత్ర సమాఖ్య వివిధ సెషన్స్‌లకు అధ్యక్షత వహించి మరియు ఉపన్యసించారు. ఈ సమావేశంలో యు.జి.సి గుర్తింపు పొందిన ఏపీ హిస్టరీ కాంగ్రెస్ జర్నలను ఆవిష్కరించారు. అదేవిధంగా ప్రముఖ చరిత్రకారుడు, కీర్తిశేషులు వై.గోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్రచురించబడిన రెడ్డిస్మృతి అనే గ్రంథ అనే గ్రంథాన్ని కూడా వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. డాక్టర్ మొవ్వ శ్రీనివాస్ మాట్లాడుతూ 400 మంది ప్రతినిధులు హాజరై సుమారు 140 పరిశోధనా పత్రాలను సమర్పింపనున్నారని తెలియజేశారు. లోకల్ సెక్రెటరీ డాక్టర్ గోవింద్ సురేంద్ర వందన సమర్పలతో ప్రారంభ సభ దిగ్విజయంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సు



దొరవారిసత్రం, జనవరి 4 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం అక్కరపాక రెవెన్యూ పరిధిలో శనివారం రెవెన్యూ సమస్యల పరిష్కార దిశగా మండల రెవెన్యూ అధికారి శైలకుమారి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది.ఈ సదస్సులో అక్కరపాక, పోలిరెడ్డి పాలెం రెండు పంచాయతీల నుండి రైతులు, గ్రామస్తులు రెవున్యూ సదస్సుకు వచ్చి భూ సమస్యలపై అర్జీలను యం.ఆర్.ఓ శైలకుమారికి అందజేశారు. అక్కరపాక చెరువులో కృష్ణాపురం సమీపంలో కొంతమంది వ్యక్తులు చెరువుని ఆక్రమించి అనధికారికంగా చెరువులో కట్టడాలు నిర్మిస్తున్న విషయాన్ని యమ్.ఆర్.ఓ శైలకుమారి తెలియజేశారు. అనంతరం అక్కరపాక సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,ఆయకట్టు సర్పంచ్ కుటెమ్మ, టి.డి.పి. పంచాయితి ఇన్‌చార్జ్ సమాది సుబ్రమణ్యం, నెలవల శ్రీనివాసులు గ్రామస్తులతో కలసి చెరువు హద్దులను ఏర్పాటు చేయాలని మండల రెవెన్యూ అధికారికి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి శైలకుమారి,మండల సర్వేయర్,సచివాలయ సిబ్బంది,గ్రామ సర్పంచ్‌లు, ఆయకట్టు ప్రసిడెంట్ ,టి.డి.పి పార్టీ పంచాయితీ ఇన్‌చార్జులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయనగర్‌లో అక్రమణలు తొలగింపు



వెంకటగిరి, జనవరి 4 ప్రభాతవార్త : పట్టణంలోని ఉపాధ్యాయనగర్ వద్ద ఉన్న రోడ్డుకి ఇరువైపులా అక్రమ కట్టడాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. 40 అడుగుల రోడ్డును చుట్టుపక్కల నివాస వారు ఆక్రమించడంతో వీటిని తొలగించి, అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఒక రేకుల షెడ్డును కూడా కూల్చివేశారు. సీఐ ఏవి రమణ ఎస్ఐ సుబ్బారావు సిబ్బంది పర్యవేక్షణలో ఆక్రమణల తొలగింపు జరిగింది. పట్టణంలో ఆక్రమణాల తొలగింపుకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. సర్వేయర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్సిడీ ధరలకు రైతులకు డ్రోన్లు పంపిణీ

వెంకటగిరి జనవరి 4, ప్రభాతవార్త : సబ్సిడీ ధరలకు రైతులకు డ్రోన్లు ఇస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారిని సుజాత తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తనుజరెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఐదు మంది రైతులు గ్రూపుగా ఏర్పడి డ్రోన్లు తీసుకోవచ్చని తెలిపారు. 85 శాతం సబ్సిడీతో డ్రోన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఎరువులు విత్తనాల కొరతలేదని సమృద్ధిగా ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో కోటేశ్వరరావు మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం



బాలాయపల్లి, జనవరి 4 ప్రభాతవార్త : ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మాజీ ఏఎంసీ చైర్మన్ సిసి నాయుడు, ఎస్సై కామినేని గోపిలు ప్రారంభించారు. విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా ఎస్సై, ఎంఈఓ కిల్లా వెంకటేశ్వర్లు, సీసీ నాయుడు, ప్రిన్సిపాల్ శ్రీహరి వడ్డించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో సంఖ్య పెంచేందుకు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎంఈఓ కిల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకా లు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సర్పంచి బి వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ మెంబర్ చంద్రమోళి, టిడిపి నేతలు మధు నాయుడు, కందిమల్ల శ్రీహరి నాయుడు, అధ్యాపకులు మల్లేశ్వరి, మునీంద్ర, హెచ్.ఎం.సుమతి తదితరులు పాల్గొన్నారు.

## వెంగమాంబ పురం ఈసిసిఈ డే

బాలాయపల్లి, జనవరి 4 ప్రభాతవార్త : బాలాయపల్లి మండలం వెంగమాంబ పురం అంగన్వాడీ కేంద్రంలో శనివారం ఈసిసిఈ డే సందర్భంగా మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి సామ్రాజ్యలక్ష్మి బాలింతలకు, చిన్నారుల తల్లులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలు వివరించారు. గుడ్ టచ్, బాడ్ టచ్ పై తల్లులకు వివరించారు. పిల్లల చేత పలు జంతువుల ముఖ మాస్కులు ధరించి అభినయ గేయాలు, నాటకీకరణ ప్రదర్శించారు. శారీరక, మానసిక, సాంఘిక అభివృద్ధి అంగన్వాడీ కేంద్రాలలో జరుగుతాయిని ఆమె అన్నారు. ఈ కృత్యాల ద్వారా పిల్లలలో మార్పు వస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులందరినీ ప్రతి ఒక్కరూ చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని మహిళా పోలీస్ సామ్రాజ్యలక్ష్మి కోరారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు, తల్లితండ్రులు, ప్రజాప్రతినిధులు దామా మధునాయుడు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కారం



వాకాడు, జనవరి 4 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు భూ సమస్యలు పరిష్కారం అవుతాయని టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం వాకాడు మండలం కొండూరు సచివాలయంలోని బూడిదలవాగు, నాగులమ్రి బిట్ వన్ బిట్టు గ్రామాలకు సంబంధించి సర్పంచ్ కదూరు రామయ్య అధ్యక్షతన రెవెన్యూ సదస్సు కార్యక్రమం జరిగింది. తహశీల్దార్ రామయ్య మాట్లాడుతూ నాగులమ్రి బిట్టు వన్ బిట్టు, బూడిదల వాగు రెవిన్యూ గ్రామాలలో రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. గూడూరు నియోజకవర్గ రైతు కార్యదర్శి తిరుమూరు శ్రీనివాసులరెడ్డి, మండల సర్వేయర్ శకుంతల, విఆర్ఓ హరిబాబు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## మల్టీ పర్పస్ ఫిషరీస్ సెంటర్‌కు స్థల పరిశీలన

వాకాడు, జనవరి 4 ప్రభాతవార్త : వాకాడు మండలం తూపిలి పాలెంలో సముద్ర తీరాన మల్టీ పర్పస్ ఫిషరీష్ సెంటర్ ఏర్పాటుకు జిల్లా ఫిషరీస్ అధికారి నాగరాజు, తాసిల్దార్ రామయ్య, ఎఫ్డిఓ నాయక్ స్థల పరిశీలించారు. ఫిషరీష్ జిల్లా అధికారి నాగరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య పథకం కింద తీర ప్రాంత గ్రామాలలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రెండు కోట్ల రూపాయలతో మల్టీ పర్పస్ ఫిషరీస్ సెంటర్ నిర్మాణం ద్వారా మత్స్యకారులు అభివృద్ధి చెందుతారన్నారు. మల్టీపర్పస్ ఫిషరీ సెంటర్ ద్వారా అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శకుంతల, ఎఫ్డిఓ లు రెడ్డి నాయక్, రఘు, స్థానిక నాయకులు, మండల రెవెన్యూ సిబ్బంది, ఫిషరీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఎంఎస్ఏ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ ఇక డిప్యూటీ డైరెక్టర్

శ్రీహరికోట (తడ), జనవరి 4 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పెస్ సెంటర్‌లో గత కొంతకాలంగా ఎంఎస్ఏ గ్రూప్ డైరెక్టర్‌గా ఉన్న గోపీకృష్ణ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. శనివారం ఈ మేరకు పదోన్నతులు పొందిన ఇస్రో ఉద్యోగుల వివరాలు ప్రకటించారు. ఈ శాస్త్రవేత్త ఇంజనీర్ జి మరియు గ్రూప్ డైరెక్టర్ మేనేజిమెంట్ సిస్టమ్స్ ఏరియాలో ఉండేవారు. ఇప్పుడు అదే విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. డాక్టర్ ఎస్.శంకరన్ సిజిఎం హోదా నుంచి డిప్యూటీ డైరెక్టర్ (వాల్ఫ్)గా పదోన్నతి పొందారు.

## పెన్షన్ల వెరిఫికేషన్ పక్కాగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, జనవరి 4 ప్రభాతవార్త : ప్రభుత్వం నుంచి అందిన మార్గదర్శకాల మేరకు మొదటి దశలో దీర్ఘకాలిక రోగంతో బాధపడుతున్న వారికి, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధి గ్రస్థులకు సంబంధించిన పెన్షన్ల వెరిఫికేషన్ ప్రక్రియను వచ్చే సోమవారం నుంచి పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అనర్హులు కూడా సామాజిక భద్రత పెన్షన్లు పొందుతున్నారని ఫిర్యాదుల నేపథ్యంలో వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టడానికి మార్గదర్శకాలు విడుదల చేసిందని అందులో మొదటి దశలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు అలాగే దీర్ఘకాలిక రోగంతో మంచానికే వీల్ ఛైర్‌కి పరిమితమైన 15 వేల రూపాయలు పెన్షన్ పొందుతున్న పేషంట్ల గృహ సందర్శన వెరిఫికేషన్ బృందం వచ్చే సోమవారం నుంచి పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో పథక సంచాలకులు వెలుగు శోభన్ బాబు, డెప్యూటీ సీఈవో జుబేదా జిల్లా పరిషత్, డీఎంహెచ్‌వో బాలాజీ నాయక్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, రుయాఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిని సుశీలా దేవి, తదితరులు పాల్గొన్నారు.

## గోకులకృష్ణ ఫార్మశి కళాశాలకు న్యాక్-ఎ గ్రేడ్ గుర్తింపు



సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఫార్మశి కళాశాలకు న్యాక్ సంస్థ ఎ గ్రేడ్ గుర్తింపునిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా రెండవ ఫార్మశి కళాశాలకు ఈ గుర్తింపును అందుకుంది. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్ కుమార్ విలేఖరులతో మాట్లాడు తూ నవంబర్ 25, 26 తేదీల్లో న్యాక్ సంస్థకు చెందిన ముగ్గురు సభ్యులు కళాశాలను సందర్శించారన్నారు. గత ఐదేళ్లగా చేపట్టిన కార్యక్రమాలను, కళాశాల నాణ్యత ప్రమాణాలను వారు అధ్యయనం చేసి విద్యార్థులకు కల్పించిన మౌలిక వసతులు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అనంతరం న్యాక్ ఎ గ్రేడ్ గుర్తింపునిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కళాశాలకు ప్రత్యేక నిధులు మంజూరవుతాయని పవన్‌కుమార్ చెప్పారు. న్యాక్ ఎ గ్రేడ్ సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం జి.బ్రహ్మయ్య, ఎంఎం కొండయ్య, శ్రీనివాస బాబాలు హర్షం వ్యక్తం చేశారు. న్యాక్ ఎ గ్రేడ్ సాధించినందుకు అధ్యాపక బృందంలో కోఆర్డినేటర్ డికె దేవిబాల సహకారం అందించారని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, ఏఓ మనోహర్, నాగూర్, పేట శివకుమార్, డాక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను ప్రేమతో చూడాలి



సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త : దివ్యాంగులను ప్రేమతో మంచి మనసుతో చూసి వారి ఆలనపాలన చేపడితే వారి అంగవైకల్యాన్ని మానసికంగా అధికమించేందుకు వీలవు తుందని మాజీ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ, ప్రముఖ నేత్రవైద్యులు డాక్టర్ కె.సాయిబాబా అన్నారు. శనివారం డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని పురస్కరించుకొని భవిత కేంద్రం పాఠశాలలో దివ్యాంగులకు ఆయన కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు డెంటల్ డాక్టర్ నాగజ్యోతి దంతాలను పరీక్షించి పేస్టులు, మందులు అందజేశారు. ఎంపిఆర్‌డి సేవాసంస్థ అధ్యక్షురాలు నాదెండ్ల శాంతకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసులు, రాజారావు, భీమాచారి, చెంచమ్మ, శివ, లక్ష్మి, సూర్యకుమార్ పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త : ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషిచేయాలని నూతనంగా సూళ్లూరుపేట బిజెపి పట్టణ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన అత్తిరాల కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. శనివారం బిజెపి పట్టణ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. మోడీ ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో పార్టీ శ్రేణులు సక్రమంగా పనిచేయలేకపోతున్నాయని చెప్పారు. సూళ్లూరుపేట శాసనసభ నియోజకవర్గ బిజెపి కన్వీనర్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ విజయవాడలో ఆదివారం జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో బిజెపి నేతలు తన్నీరు శేషగిరిరావు, నూతలపాటి శ్రీనివాసులు, బెజవాడ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు గోకులకృష్ణ విద్యార్థులు



సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా గూడూరులో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్‌ను ఈ నెల 3వ తేదీన నిర్వహించారు. సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రీజనల్ స్థాయిలో కబడ్డీ, బ్యాడ్మింటన్, రన్నింగ్ రేస్, లాంగ్‌జంప్, 400 మీటర్ల రిలే, డిస్కస్‌త్రో, జావెలిన్, హైజంప్, షాట్‌పుట్ పోటీల్లో గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్, ఏఓ మనోహర్, యాజమాన్యం బ్రహ్మయ్య, ఎంఎం కొండయ్య, శ్రీనివాస బాబాలు విద్యార్థులను ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు.

## సూళ్లూరుపేటలో 452వ నేత్రదానం

సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు శనివారం 452 నేత్రదానం అందింది. సూళ్లూరు ప్రాంతానికి చెందిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి (69) మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో మృతదేహం నుంచి సేకరించారు. కార్నియాలను చెన్నైలోని శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం ప్రారంభించిన ఎమ్మెల్యే



నాయుడుపేట,జనవరి 4 ప్రభాతవార్త : డొక్క సీతమ్మ మధ్యహన భోజన పథకంను సూళ్ళూరుపేట శాసన సభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ శనివారం నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే విజయశ్రీ చేతుల మీదుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేశారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మొదటిసారిగా జూనియర్ కాలేజిలో డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం, ఎంఈఓ మునిరత్నం, ప్రిన్సిపాల్ గురవయ్య, మాజీ ఏఎమ్‌సి చేర్మేన్ శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రారెడ్డి, నెలవల రాజేష్, 786రఫి, పసల గంగాప్రసాద్,పసల రమేష్, ముత్యాలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థులచే అభివృద్ధి పనులు



వాకాడు, జనవరి 4 ప్రభాతవార్త : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు 25లక్షలు రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. శనివారం వాకాడులో వున్నా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాఠశాలలోని సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న మన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఆత్మకూరు వెంకట శేషయ్య, కోణతం సుబ్రహ్మణ్యం, దండు ప్రసాద్, ఆమూరు కిషోర్ కుమార్, బిక్కి వెంకటేశ్వర్లు, బాలసుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

## పేట పోలీసుస్టేషన్‌ను తనిఖీచేసిన డిఎస్‌పి

నాయుడుపేట, జనవరి 4 ప్రభాతవార్త :నాయుడుపేట పోలీసు స్టేషన్‌ను డిఎస్‌పి చెంచుబాబు శనివారం తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లో పోలీసుల పనితీరును ఆరాతీశారు. దీఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పలుకేసులకు సంబంధి చిన రికార్డులను పరిశీలించారు.పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈసందర్భంగా డిఎస్‌పి మాట్లడుతూ నాయుడుపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట సిఐ బాబి,ఎస్సై ఆదిలక్ష్మి,పోలీసు సిబ్బంది ఉన్నారు.

## పేటలో బస్‌షెల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నాయుడుపేట,జనవరి 4 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని గాంధీపార్కు సమీపంలోని వెంకటగిరిరోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను సూళ్ళూరుపేట శాసనసభ్యులు నెలవల విజయశ్రీ శనివారం ప్రారంభి ంచారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం కోసం కట్టా సుదకర్‌రెడ్డి, జ్యోతిలు బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం, మాజీ చేర్మేన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## సత్వర భూ సమస్యలు పరిష్కారం : సబ్ కలెక్టర్



బాలాయపల్లి, జనవరి 4 ప్రభాతవార్త : రెవెన్యూ సదస్సులో సత్వరమే భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేందర్ మీనా తెలిపారు. బాలాయపల్లి లో జరిగిన రెవెన్యూ సదస్సులో సబ్ కలెక్టర్ పాల్గొని వినతి పత్రాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నం భోజనాన్ని ప్రారంభించిన నానాజీ



గూడూరు, జనవరి 4 ప్రభాతవార్త: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎస్‌కెఆర్ ప్రభుత్వం జూనియర్ కళాశాల నందు టిడిపి నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ పాల్గొని ప్రభుత్వం చేపట్టిన మధ్యాహ్నం భోజనం పథకం గురించి వివరించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ నవీన్ కుమార్ నాయకులు చెంచురామయ్య సేలం కిరణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

## సదస్సుల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం

ఓజిలి, జనవరి 4 ప్రభాతవార్త : భూ సమస్యలకు ఫుల్ స్టాఫ్ పెట్టడం ద్వారా గ్రామం బాగుపడుతుందని ఓజిలి మండల ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్ పేర్కొన్నారు. శనివారం ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ పరిధిలో ఎమ్మార్వో అరవ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నలజ్నా రాజాశేఖర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాడి వెంకటయ్య,టిడిపి నాయకులు రమేష్, అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్‌ను కలిసిన గద్దల

వెంకటగిరి, జనవరి 4ప్రభాతవార్త : దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 2024 ఆగస్టు 1వ తేదీన ఎస్సీ కులాల ఏ,బి,సి,డి వర్గీకరణ వారి ఉప కులాల జనాభా దామాషా ప్రకారం ఆయా రాష్ట్రాలు వర్గీకరణ చేసుకోవచ్చుని తీర్పు ఇవ్వడం జరిగింది దానిని అమలుపరిచే భాగంలో ఆంధ్ర రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్‌గా రాజీవ్ రంజాత్ మిశ్రా (విశ్రాంతి ఐఏఎస్) రాష్ట్ర ప్రభుత్వం నియమించారు. అందులో భాగంగా ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గద్దల మునెయ్య ఆధ్వర్యంలో ఎస్సీ కులాల వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ శ్రాజీవ్ రంజాత్ మిశ్రాకి వినతి అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గద్దల బాబ్జి, ఎరుకుల సంఘం నాయకులు బండి రవి, మాల మహానాడు నాయకులు దక్కా చిరంజీవి, ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు, గద్దల చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నేతృత్వంలో పేట అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

నాయుడుపేట రూరల్, జనవరి 4 ప్రభాతవార్త : పరుగులు తీస్తున్న రాష్ట్ర అభివృద్ధితో పాటు సూళ్లూరుపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. శనివారం నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నగరవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నగర వనాల ద్వారా మానసిక ప్రశాంతత అటు పెద్దలకు ఇటు చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. 35 ఎకరాల్లో 1.13 కోట్ల నిధులతో ఈ నగర వనాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు.

## ఫోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

- చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలి
- గూడూరు డిఎస్పీ రమణకుమార్



చిట్టమూరు, జనవరి 4 ప్రభాతవార్త : ఫోక్సో కేసులో ఈశ్వరవాక గ్రామానికి చెందిన పిలిమేటి శీనయ్యను అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు గూడూరు డిఎస్పీ రమణకుమార్ తెలియజేశారు. అలాగే చిన్నారుల పట్ల తల్లిదండ్రులు సైతం కనీస జాగ్రత్తలు తీసుకొని వారిని ఎల్లవేళలా కంటికి రెప్పలా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31న సాయంత్రం ఈశ్వరవాక ఎస్టీ కాలనీలో మూడేళ్ల పాపపై ఆ కాలనీకి చెందిన పిలిమేటి శీనయ్య లైంగిక దాడికి పాల్పడినట్లు ఆ చిన్నారి పెద్దమ్మ బండి శైల ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్టమూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనట్లు చెప్పారు. ఫోక్సో కేసులో డిఎస్పీగా విచారణ చేపట్టిన తాను అన్ని వివరాలు సేకరించి నిందితుడిని శుక్రవారం సాయంత్రం కాలనీకి సమీపంలోని మధ్యవర్తుల సమక్షంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చిన్నారిపై నిందితుడు లైంగిక దాడికి పాల్పడి నట్లు డిఎస్పీ తెలిపారు.

## వెలికల్లు చెరువు వేలం నోటీసు

తిరుపతి జిల్లా, డక్కిలి మండలం, వెలికల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని వెలికల్లు చెరువు లో చేప పిల్లలు వేసి పెంచుకుని, అమ్ముకునే హక్కులను **1434** ఫసలీకి బహిరంగ వేలం పాట నిర్వహించబడును. **9-01-2025** తేదీ నాడు ఉదయం **11**గంటలకు వెలికల్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించబడును. వేలం పాటలో పాల్గొనే వారు రు.**25,000/-**లు ధరావత్తు చెల్లించాలి.

సం/- పంచాయతీ కార్యదర్శి,
వెలికల్లు గ్రామ పంచాయతీ,
డక్కిలి మండలం